స్టేట్ బ్యాంకులో అగ్నిప్రమాదం

విశాలాంధ్ర - ఆనందపురం: వెల్లంకి ఎస్‌బీఐలో శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో బ్యాంకులో నుండి దట్టమైన పొగలు రావడంతో గమనించిన స్థానికులు వెంటనే సమాచారాన్ని అందించారు. అప్రమత్తమైన స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరాజు అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలను అదుపు చేశారు. సమాచారం తెలిసిన వెంటనే బ్యాంకు సిబ్బంది చేరుకొని బ్యాంక్ రికార్డులు ఇతర సామాగ్రిని బయటకు తీశారు. అయితే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ఈ ప్రమాదం జరిగిందని సరైన సమయంలో మంటలను అదుపు చేయడం వలన ఎటువంటి ప్రమాదం లేదని బ్రాంచ్ మేనేజర్ కె.వి.శ్రీధర్ తెలిపారు. ప్రమాదంపై ఆనందపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తొలగింపుతో తొలి అడుగు..!

ఏయూ పరిపాలనా భవనం వద్ద ఇనుప గేట్లు తొలగింపు

అందరి కోరిక మీదటే తొలగింపు

అందరు కోరిన విధంగానే ఇనుప గేట్లు తొలగించడం జరిగింది. యూనివర్సిటీలోని విద్యార్థులు, ఆచార్యులు ప్రధాన పరిపాలన భవనం వద్ద ఉన్న ఇనుప గేట్లను తొలగించమని వినతి పత్రాలు ఇస్తూ కోరిన కారణంగానే తొలగింపు ప్రక్రియ చేపట్టాము.

- ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య జి.శశిభూషణరావు

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా ఆచార్య జి.శశిభూషణరావు పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత కొద్ది గంటల్లోనే ఏయూలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. యూనివర్సిటీ ప్రధాన పరిపాలన భవనం వద్ద భద్రతా కారణాలతో ఏర్పాటు చేసిన ఇనుప గేట్లను తొలగించారు. అదేవిధంగా ఏయూ ఉద్యోగులు, పెన్షనర్లు ఎదురుచూస్తున్నట్లుగానే వారి జీతాలు, పెన్షన్లను ఖాతాలలో జమ చేసేలా నిర్ణయం తీసుకున్నారు. వీసీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలను ఏర్పాటు చేశారు. ఇక తొలగింపు ప్రక్రియ విషయానికొస్తే ఉదయం నుంచి ఏయూ పరిపాలనా భవనం ఎదురుగా ఉన్న ఇనుప గేట్లు, కంచెను తొలగించే పనులను ప్రారంభించారు. యుద్ధ ప్రాతిపదికన వీటిని తొలగించి, వర్సిటీ పరిపాలనా భవనంలోనికి ఎవరైనా సులువుగా వచ్చే ఏర్పాటు చేశారు. కానీ ఈ ఇనుప గేట్లు తొలగింపుపై యూనివర్సిటీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఏర్పాటు చేసిన మూడంచెల భద్రత వలయాన్ని తొలగించాలని కొంతమంది విద్యా ర్థులు, పరిశోధకులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు కోరుతుండగా, దేశవ్యాప్తంగా ఉన్న పలు ప్రతిష్టాత్మక ఐఐటీలు, యూనివర్సిటీలు, ఇతర ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రైవేటు విద్యాసంస్థల్లోకి ఇష్టానుసారం ఎవరుబడితే వారు రాకుండా మూడంచల భద్రత వ్యవస్థ ఉండేలా ఇనుపు గేట్లు ఏర్పాట్లు చేస్తుంటారని, అలా ఉండడం మంచిదని కొంతమంది విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ భద్రత వ్యవస్థ వున్నప్పుడు విద్యార్థులకు ఏమైనా సమస్యలు వస్తే ఆ విభాగాధిపతి, స్టూడెంట్ అఫైర్స్ డీన్, ప్రిన్సిపాల్‌తో తమ సమస్యను చెప్పుకొని అప్పటికి పరిష్కారం కాకపోతే యూనివర్సిటీ ప్రధాన పరిపాలన భవనం వద్దకు వచ్చి ఉన్నతాధికారిని కలవడం, పరిష్కారం కాకపోతే నిరసన వ్యక్త పరచడమో చేసేవారని, ఇప్పుడు అలా ప్రొసీజర్ ప్రకారం కాకుండా సమస్య వచ్చిన వెంటనే విద్యార్థులు నేరుగా ప్రధాన పరిపాలన భవనం వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టే కార్యక్రమాలు అధికమయ్యే అవకాశం ఉందని పలువురు ఆచార్యులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ తొలగింపు ప్రక్రియ వివాదాస్పదంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విశాఖ జిల్లాకు చెందిన కొంతమంది ప్రజాప్రతినిధులు ఈ గేట్లు తీయిస్తామంటూ ప్రకటించడం, ఇన్‌చార్జి వీసీ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఈ నిర్ణయం తీసుకోవడంతో రాజకీయ కారణాలతో ఈ తొలగింపు ప్రక్రియ చేపట్టారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఏది ఏమైనా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఈ ఇనుప గేట్లు తొలగింపు విషయం చర్చనీయాంశంగా మారింది.

బిక్కుబిక్కుమంటున్న కొండవాలు ప్రాంత నివాసులు

మధురవాడ ప్రాంతంలో తుఫాను తీవ్రత

విశాలాంధ్ర - పీఎం పాలెం: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం ప్రభావంతో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మధురవాడ ప్రాంతం వణుకుతుంది. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారి, డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మధురవాడ ప్రాంతంలో ఉన్న కొండవాలు నివాసులు భయాందో ళనకు గురౌతున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. తుఫాను ప్రభావంతో రాష్ట్రంలోని భీమిలి నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీని కారణంగా మధురవాడ పరిధిలో గల కొండవాలు ప్రాంతాలైన పీఎం పాలెంలోని కొన్ని కొండవాలు ప్రాంతాలు, మారికవలసలో ఉన్న కొండవాలు ప్రాంతాలు శారదనగర్, సాయిరాంకాలనీ, స్వయంకృషి నగర్, శివశక్తినగర్, గాంధీనగర్, ముత్యాలమ్మ కాలనీ, కొమ్మాది ప్రాంతాల్లో ప్రజలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని జీవిస్తున్నారు. మరోవక్క చెరువులను తలపించేలా రోడ్లు వరదతో ప్రవహిస్తున్నాయి. తెరిపివ్వకుండా కురుస్తున్న వర్షాలకు అనేక ఇల్లు నానిపోయి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఏ క్షణం ఏం జరుగుతుందో ఉన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. మరికొన్ని ప్రాంతాల్లో కొండ చరియలు మట్టి విరిగిపడుతున్నాయి. మధురవాడ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో అనేక లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు ప్రవేశిస్తుంది. మధురవాడ ప్రధాన రహదారి చెరువును తలపించేలా సర్వీస్ రోడ్లన్నీ ఏరులై పారుతున్నాయి. వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. బ్రిడ్జి కింద ప్రయాణం మరింత నరకంగా మారింది.

1254వ రోజుకు ఉక్కు దీక్షలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న దీక్షలు 1254వ రోజుకు చేరుకున్నాయి. రిలే నిరాహార దీక్షలో ఎఫ్ఎండి, ఆర్ఎస్ఆర్ఎస్, సీఎంఈ, వివిఎస్‌జిహెచ్, ప్లాంట్ డిజైన్, విభాగాల కార్మికులు పాల్గొన్నారు. పోరాట కమిటీ నాయకులు డి. ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ సెయిల్‌లో విలీనం కొరకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల తాస్సారం తగదని త్వరితగతిన ప్రధాని ప్రకటన చేయాలని కోరారు. ఉత్పత్తి ఉత్పాదకత రోజురోజుకు దిగజారు తుందని, భద్రత ప్రమాణాలు అడుగంటుతున్నాయని, దిగజారిన ఆర్థిక పరిస్థితి, భారీ నష్టాలు, వర్కింగ్ క్యాపిటల్ సైతం ధనం సమకూరకపోవడం, నెలల తరబడి కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగుల అధికారుల వేతనాలు సకాలంలో ఇవ్వడం లేదన్నారు. ఈ దీక్ష శిబిరంలో పి.రామకృష్ణ రాజు, ఎంఎస్ రావు, పిజికే రాజు, కేఎస్ సచారావ్, డి.మధు, జి.మోహన్, బివి రమణ, పిఎస్‌విఎస్ గోపాల్, ఎం.చిన్నయ్య, ఐ.శ్రీను, ఏ.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి దేవిగా దర్శనమిచ్చిన విజయ దుర్గాదేవి అమ్మవారు

విశాలాంధ్ర - మధురవాడ: విశాఖలోని మధురవాడ ట్రైలర్స్ కాలనీలో గల శ్రీ విజయ దుర్గాదేవి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం శాకంబరీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. వివిధ రకాలైన పళ్ళు, ఆకుకూరలు, కూరగాయలతో అమ్మవారికి అలంకరణ చేశారు. అమ్మవారి మూల విరాట్‌తో పాటు ఆలయంలోని దేవతామూర్తులు, ఆలయ ప్రాంగణం అంత వివిధ కూరగాయలతో అలంకరణ చేశారు. కూరగాయలతో కదంబ ప్రసాదాన్ని తయారుచేసి భక్తులకు వితరణ చేశారు. లోకం సస్యశ్యామలంగా, పాడిపంటలతో ఉండడానికి, ఎటువంటి కరువు కాటకాలు రాకుండా ఆషాడ మాసంలో శాకంబరీ ఉత్సవాలు నిర్వహిస్తారు. శుక్రవారం కావడంతో శాకంబరీ దేవిగా దర్శనమిచ్చిన విజయదుర్గా దేవి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. ఆలయ దర్మకర్త బంగారు లక్ష్మి ఆధ్వర్యంలోని ఆలయ ప్రధానార్చకులు శ్రీకాంత్ శర్మ అమ్మవారికి పంచామృతాలు, నారికేల, పసువు, కుంకుమ సుగంధ ద్రవ్య జలాలతో అభిషేకం జరిపించారు.

గీతం బిజినెస్ స్కూల్ ఎంబీఏ అడ్మిషన్లు ప్రారంభం

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా నిర్వహిస్తున్న ఎం.బి.ఎ. కోర్సులో అడ్మిషన్లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు ప్రవేశాలు పొందిన విద్యార్థులను అభిందించారు. విద్యా ర్థులలో మేనేజ్‌మెంట్ నైపుణ్యాలను పెంచే విధంగా ఎనలిటిక్స్ ప్రయోగశాల, బ్లూమ్ బర్గ్ ప్రయోగ శాల, బిజినెస్ ఇంగ్లీషుపై భాషా ప్రయోగశాలను నెలకొల్పామని ఆయన తెలిపారు. పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా సిలబస్‌లో మార్పులు చేస్తున్నామని, కేస్ స్టడీస్ ఆధారిత విద్యను ప్రవేశ పెట్టామని వెల్లడించారు. ప్రతిభ గల విద్యార్థులకు 100 శాతం స్కాలర్ షిప్ లను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.జి.కోర్సుల ఛైర్ పర్సన్ డాక్టర్ ఎ.వేంకటేశ్వర్లు, యు.జి. కోర్సుల ఛైర్ పర్సన్ ప్రొఫెసర్ పి.షీలా, అడ్మిషన్ల విభాగం ఛైర్ పర్సన్ డాక్టర్ టి.వేంకటేశ్వర్లు, స్టూడెంట్ లైఫ్ ఛైర్ పర్సన్ డాక్టర్ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలలో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - సాగర్‌నగర్: సాగర్‌నగర్ సమీపంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన కరుణ కుమారి, సారికలు ఇటీవల బెంగుళూరు కలశీరవ స్టేడియంలో అథ్లెటిక్స్ పార స్పోర్ట్స్‌లో బంగారు, కాంస్య పతకాలు సాధించారు. 9వ తరగతి చదువుతున్న కరుణ మేమారి జావెలిన్‌లో బంగారు పతకం, షాట్ పుట్‌లో కాంస్య పతకం, సారిక లాంగ్ జంప్‌లో కాంస్య పతకం సాధించింది. కోచ్ సత్యవతి కృషిని అందరూ అభినందిం చారు. పాఠశాల ప్రిన్సిపాల్ తిరుమల ప్రసాద్ విద్యార్థులను అభినందించారు.

ఏపీ మెడ్ టెక్ జోన్‌ను సందర్శించిన ఎం.ఎస్.ఎం.ఈ. మంత్రి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ ఉక్కు నగరం పరిధిలో ఉన్న ఏపీ మెడ్ టెక్ జోన్‌ను రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం సాయంత్రం సందర్శించారు. అక్కడ వివిధ కంపెనీల ఆపరేషన్స్ ప్రక్రియలను పరిశీలించారు. వైద్య పరికరాల తయారీకి సంబంధించిన వివిధ కంపెనీలను సందర్శించిన ఆయన వివిధ కంపెనీల సీఈవోలతో ఆత్మీయంగా భేటీ అయ్యారు. అక్కడున్న వసతులు, కంపెనీలు, ఉద్యోగులు ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు, మెడ్ టెక్ జోన్ ప్రతినిధులు అక్కడున్న వివిధ కంపెనీలను చూపించారు. వాటి ద్వారా ఉత్పత్తయ్యే పరికరాలు, మార్కెటింగ్ ట్రెండ్ ఇతర అంశాల గురించి వివరించారు. ఆయన వెంట పలు కంపెనీల సీఈవోలు, విశాఖపట్టణం, అనకాపల్లి జిల్లాల పరిశ్రమల శాఖ అధికారులు గణపతి, శ్రీధర్ ఉన్నారు.

స్థితప్రజ్ఞ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

విశాలాంధ్ర - విశాఖ: ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్స హించేందుకు స్థితప్రజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక పెదవాల్తేరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, ఆటలు పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు ఈవీఎస్ లక్ష్మి మాట్లాడుతూ స్థితప్రజ్ఞ ఫౌండేషన్ చేస్తున్న కార్యక్రమాలు పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. స్థితప్రజ్ఞ మేనేజింగ్ ట్రస్టీ వైవివి సత్యనారాయణ మాట్లాడుతూ ఉన్నతమైన ఆశయాలు ఏర్పరచుకొని వాటిని సాధించేందుకు విద్యార్థులు తగిన కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వై.ప్రదీప, హరిప్రియ, దుర్గ, బాబు, నవీన్, ఉపాధ్యాయులు అనురాధ, సుధాకిరణ్, శ్రీలక్ష్మి, శ్రావణి పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌కు సరికొత్త చికిత్సా విధానం

విశాలాంధ్ర - మధురవాడ: రక్తం గడ్డ కట్టడంతో రక్తనాళం మూసుకుపోవడం లేదా రక్తనాళం పగిలిపోవడం ద్వారా మెదడుకు రక్త సరఫరాలో అంతరాయం ఏర్పడే పరిస్థితిని బ్రెయిన్ స్ట్రోక్ అంటారని దీనిపై తమ పరిశోధనల ద్వారా సరికొత్త చికిత్సా పద్ధతులను గుర్తించినట్లు ఇల్లినాయస్ విశ్వవిద్యాలయం కేన్సర్ బయాలజీ, ఫార్మకాలజీ విభాగం న్యూరో సైన్స్ పరిశోధకుడు డాక్టర్ వీరవల్లి కృష్ణ కుమార్ వెల్లడించారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. స్ట్రోక్‌లో ప్రధానంగా రెండు రకాలు ఉంటాయని అవి ఇస్కీమిక్, హెమరేజిక్ అని ఇవి రక్తం గడ్డకట్టడం వల్ల బ్రెయిన్‌కి రక్తం సరఫరా ఆగిపోయినప్పుడు ఇస్కీమిక్ స్ట్రోక్ వస్తుందని ఆయన వివరించారు. ప్లాస్మినో జెన్ కణాల ప్రభావాన్ని అదుపు చేయడం ద్వారా ఇస్కీమిక్ స్ట్రోక్‌ను నివారించ వచ్చునని తన అధ్యయనాల ద్వారా కనుగొన్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్ దాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజా, సీనియర్ ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వీయ ప్రేరణ విజయానికి తొలి మెట్టు

విశాలాంధ్ర - మల్కాపురం: జీవితంలో విజయాన్ని సాధించడానికి స్వీయ ప్రేరణ ఎంతో అవసరం అని సీనియర్ హిందీ అధ్యాపకురాలు ఎ.ఆదిలక్ష్మి అన్నారు. నూతనంగా ప్రవేశం పొందిన డిగ్రీ విద్యార్థినులను ఉద్దేశించి శుక్రవారం ఆమె మాట్లాడారు. విద్యార్థినిలు విజయాన్ని సాధించాలనే తపనతో పాటు అవకాశాలను సృష్టించుకో గల శక్తి కూడా కలిగి ఉండాలని అన్నారు. అడ్డంకులను అధిగమించి నప్పుడే దృఢమైన వ్యక్తిత్వం ఏర్పడుతుందని అన్నారు. ఇతరుల ప్రోత్సాహం కంటే స్వీయ ప్రేరణ మనలను విజయ శిఖరాలకు చేరుస్తుందని అన్నారు. ఉన్నత వ్యక్తిత్వం పై ఆంగ్ల అధ్యాపకురాలు ఎ.రోజా ప్రసంగించారు. ఇతరుల సేవకు అంకితమైనప్పుడే నిజమైన వ్యక్తిత్వం వికసిస్తుందని ఆమె అన్నారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ కేస్లీన్, సదస్సు కో-ఆర్డినేటర్లు ఇ.వి.ఎస్. భాగ్యలక్ష్మి, ప్రేమలత, డాక్టర్ సిహెచ్. ప్రశాంతి, వి.అంజలీదేవి తదితరులు ప్రసంగించారు.

రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

వర్షాధార కాలువలను ఇష్టానుసారంగా ఆక్రమణ పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - ఆనందపురం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదారిపైనే వర్షపు నీరు ప్రవహిస్తోంది. వర్షాలకు వాగులు, వంకలు, గెడ్డలు నీటితో ప్రవహిస్తున్నాయి. ఆనందపురం మండలంలో బంటుపల్లి వారి గ్రామ పంచాయతీ పరిధిలో జట్లమ్మ కొండకు అనుసంధానంగా ఉన్న వర్షాధార గెడ్డ వాగును అధికారులు, నాయకులు పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. శుభశ్రీ ఫంక్షన్ హాల్ వద్ద నుండి చెరువులకు అనుసంధానంగా ఉన్న గెడ్డవాగును వర్షాధార నీరు వెళ్లడానికి వీలు లేకుండా కొందరు వాళ్ళ స్వార్థ ప్రయోజనాల కోసం కొన్నిచోట్ల నామమాత్రపు చిన్న చిన్న గొట్టాలతో కాలువలను కప్పేసి అక్రమ కట్టడాలు చేపడుతున్నారు. అందువల్ల వర్షం పడేటప్పుడు అనుగుణంగా వెళ్లాల్సిన వర్షం నీరు బయటకు పోతుంది. కొన్నిచోట్ల నీరు నిలిచిపోతుంది. చెరువులోకి వెళ్లాల్సిన నీరు రోడ్లు పైన ప్రవహిస్తుంది. కనీసం చెరువులకు అనుసంధానంగా ఉన్న కాలువలను శుభ్రపరిచి వాటి ద్వారా వర్షపు నీటి వనరును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ఇక్కడ అందుకు భిన్నం. కాలువ సైతం నీరు ప్రవహించుటకు అవకాశం లేకుండా వాళ్ళ స్వార్థ ప్రయోజనాల కోసం ఇష్టానుసారంగా కప్పేయడం వల్ల ఎక్కడ వర్షపు నీరు అక్కడే నిలిచిపోతుంది. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు చొరవ తీసుకొని శుభ శ్రీ ఫంక్షన్ హాల్ వద్ద నుండి చెరువు వరకు అనుసంధానంగా ఉన్న కాలువను శుభ్రపరిచి వర్షాధార నీరు సరైన మార్గంలో వెళ్లే వీలుగా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుచున్నారు.

భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగరాదు

కలెక్టర్ హరింద్ర ప్రసాద్

విశాలాంధ్ర - గోపాలపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి గిరి ప్రదక్షిణ ఏర్పాట్లను జిల్లా కలెక్టరు హరింద్ర ప్రసాద్, నగర మేయర్ హరి వెంకట కుమారి, జిల్లా అధికార యంత్రాంగం ఈఓ ఎస్.శ్రీనివాసమూర్తితో పర్యవేక్షించారు. శనివారం జరిగే సింహాచలం గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు పర్యవేక్షణ నేపథ్యంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, మేయర్ హరి వెంకట కుమారితో కలిసి శుక్రవారం కలెక్టర్ పర్యటించారు. లక్షల సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున సింహగిరిపై క్యూలైన్లు, ఆలయ ప్రదక్షిణ కోసం ఏర్పాటు చేసిన ర్యాంపులు, కొబ్బరి కాయలు కొట్టే ప్రదేశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం వంటి అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉండాలన్నారు. భక్తులకు దర్శనం ఇచ్చే నీలాద్రి గుమ్మాన్ని ఈఓ కలెక్టర్‌కి చూపించి ఏర్పాట్లను వివరించారు. ఆలయ ఉత్తర ద్వారం వద్ద భక్తుల కోసం ఏర్పాటు చేసిన షెడ్డు వర్షానికి కారిపోతుండడాన్ని గమనించిన కలెక్టర్ ఇంజినీర్లకు పలు సూచనలు చేశారు. వర్షం కారణంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. క్యూ లైన్లలో బురద లేకుండా చూడాలని చెప్పారు. వచ్చే భక్తులకు అర్థమయ్యేలా దారిపొడవునా సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం పటిష్టంగా ఉండాలని, భక్తులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందేలా చూడాలని తెలిపారు. కమాండ్ కంట్రోల్ రూం వద్ద అధికారులు కూడా సమాచారం తెలుసుకునే ఏర్పాటు చేయాలని ఇందుకోసం ప్రత్యేకంగా ఫోన్ నంబర్ ఉండేలా చూడాలని కలెక్టర్ చెప్పారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో మెట్ల మార్గంలోని పరిస్థితిని ఈఓ కలెక్టర్‌కి తెలియజేశారు. భారీ వర్షం వచ్చి మెట్లపై నుంచి వరద వచ్చేలా ఉంటే భక్తుల రాకపోకలు నిలిపేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షం ఉన్నప్పటికీ ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు ఉండరాదని చెప్పారు. కొండ దిగువ ఏర్పాట్లను వేగవంతం చేయాలని తెలిపారు. కొన్ని చోట్ల షామియానాలు చెదిరిపోవడాన్ని గమనించిన కలెక్టర్ వాటిని సరిచేయడంతో పాటు వర్షానికి భక్తులు తడవకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. సింహగిరి ప్రదక్షిణ ఏర్పాట్లన్నీ పక్కాగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. దేవస్థానం సిద్ధం చేసిన ప్రణాళికను పరిశీలించిన ఆయన అధికారులు బాధ్యతగా వ్యవహరించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు.

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో గంటా పర్యటన

విశాలాంధ్ర - తగరపువలస: రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పర్యటించారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ సంగివలస వద్ద కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ వర్షం పడితే ఇబ్బందులు పడుతున్నారని, దివిస్ వాళ్ళు గతంలో ఈ బ్రిడ్జి వద్ద కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. చెరువు వద్ద కూడా అక్రమంగా ఫెన్సింగ్ వేశారని, ఈ బ్రిడ్జి వద్ద ఉన్న చెరువులో వాటర్ ఫ్లో అయిన ప్రాంతం కాస్త తగ్గిస్తే వర్షపు నీరు వెళ్తుందని అధికారులకు చెప్పారు. మధురవాడలో వర్షపు నీరు నిల్వల సమస్య నా వరకు వస్తే వాటిని వెంటనే అధికారులకు చెప్పి పరిష్కారం చూపించామన్నారు. ఈ కార్యక్రమంలో కోరాడ రాజబాబు, సందీప్ పంచకర్ల తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ పనులను వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - విశాఖ: ఇంజనీరింగ్ పనులను వేగవంతం చేయాలని మెట్రోపాలిటన్ కమీషనర్ వి.రవీంద్ర అధికారులను ఆదేశించారు. వీఎంఆర్డీఏ ఇంజనీరింగ్ విభాగంపై శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్టీలెవల్ కార్ పార్కింగ్ ప్రాజెక్ట్, ఎన్డీఏ పై వంతెన వద్ద నిర్మిస్తున్న రైల్ ఓవర్ వంతెన, ఎండాడ, చీమలాపల్లిల్లో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. సాధ్యమైనంత త్వరగా వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రధాన ఇంజనీర్ భవానీ శంకర్, పర్యవేక్షక ఇంజినీర్ ఎం. బలరామరాజు, కార్యనిర్వహక ఇంజినీర్లు, ఉప కార్యనిర్వహక ఇంజినీర్లు, సహాయ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE VII ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.725/2016

Between:
STATE BANK OF INDIA, S.M.E. Centre Visakhapatnam, Rep. by its Manager ...Plaintiff
And
Sai Priyanka M.P.S. & 15 others ...Defendants

SUMMONS

To,
D-12: Kodi Anthony, S/o. Not known to the plaintiff, Hindu, aged 55 years, R/at D.No.12-52, Arilova, Visakhapatnam-40
D-13: Kodi Leela, D/o. Kodi Anthony, Hindu, aged 55 years, Rest-do-
D-14: Pisini Appala Swamy, S/o. Not known to the plaintiff, Hindu, aged 74 years, R/at D.No. 13-1251/1, Arilova, Visakhapatnam-40.
D-15: Pisini Prasanna Kumar, S/o. P. Appala Swamy, Hindu, aged 40 years, Rest-do-
D-16: Pisini Harika, D/o. P. Appala Swamy, Hindu, aged 40 years, Rest-do-

Please take notice that the above suit filed by the plaintiff Bank against you for recovery of suit amount of **Rs.3,45,208/-**. No. of times your summons returned to the Hon'ble Court. Then the Hon'ble Court was pleased to ordered notice to you through this publication. Therefore, you are hereby summoned to appear before the Hon'ble Court in person or through a Pleader duly instructed on **22-07-2024** at **10:30 A.M** if you failed to appear before the Hon'ble Court on that day the matter will be heard in your absence and necessary orders will be pronounced, against you.

B. JAYAVARDHAN, Advocate
Visakhapatnam-16. **Cell: 9440590258**

మోకాళ్లతో తిరుమల మెట్లు ఎక్కి మొక్కు తీర్చుకున్న "కొప్పిశెట్టి"

విశాలాంధ్ర - నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గంలో శాసనసభ్యురాలుగా వంగలపూడి అనిత పోటీ చేసిన సందర్భంలో భారీ విజయం సాధిస్తే మోకాళ్ళతో నీ మెట్లు ఎక్కుతానని మొక్కుకున్న మొక్కుబడులను మండల పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ నేరుగా రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనితతో కలిసి ఆ మొక్కుబడులను శుక్రవారం తిరుమల తిరుపతి కొండపైకి ఎక్కి తీర్చుకున్నారు. భారీ మెజారిటీతో గెలిచిన వెంటనే నీ కొండకు వస్తానని మొక్కుకున్న కొప్పిశెట్టి ఆ విధంగానే పాయకరావుపేట నియోజకవర్గంలో ఉన్న కొంతమంది నాయకులతో కలిసి రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత పాటు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ముందుగా వెంకటేష్ కొద్దిమంది నాయకులతో తిరుమల తిరుపతికి అలిపిరి నుండి కాలినడకన వెళ్లారు. ఈ సందర్భంగా కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ అనితమ్మ భారీ మెజార్టీతో గెలిస్తే కలియుగ దైవం తిరుమల తిరుపతి దర్శనానికి మెట్ల మార్గం గుండా దర్శనానికి వెళ్లడమే కాకుండా మోకాళ్ళ పర్వతం మోకాళ్ళతో నడుస్తానని మొక్కుకున్నానని,తిరుమల శ్రీనివాసుడి ఆశీస్సులతో ఎమ్మెల్యేగా అనితమ్మ భారీ మెజారిటీతో గెలవడమే కాకుండా హెూం మంత్రి అయినందుకు గాను మొక్కు చెల్లించుకున్నానని అన్నారు. ఆయనతోపాటు వెంకటేశ్వర స్వామిని దర్శించు కున్న వారిలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాసినాయుడు, మండల పార్టీ అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు,జానకి శ్రీను,అమలకంటి అబద్దం, జిల్లా పార్టీ నాయకులు కురందాసు నూకరాజు, గింజాల లక్ష్మణరావు, కొప్పిశెట్టి బుజ్జి,ఎస్.వెంకటరాజు,గుర్రం రామకృష్ణ, లింగం నాయుడు, తిరుమలరావు, గోసల శ్రీకాంత్, గింజాల శ్రీనివాసరావు, కాళ్ల శ్రీను తదితరులు ఉన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా గిరిప్రదక్షిణ ఏర్పాట్లు చేయాలి

అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులకు చిన్న అసౌకర్యం కలగకుండా సమగ్ర ఏర్పాట్లు పూర్తి చేసేయాలని, 19వ తేదీ రాత్రి నాటికే అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలని వివిధ విభాగాల అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. భక్తులకు చిన్నపాటి ఇబ్బంది కూడా కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం సాయంత్రం వివిధ విభాగాల అధికారులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా డిపార్మెంట్ల ఆధ్వర్యంలో ఇప్పటి వరకు జరిగిన ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. తగిన సూచనలు చేశారు. మార్గదర్శకాలు జారీ చేశారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం వహించి వేడుకను విజయవంతం చేయాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం ఎక్కడికక్కడ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. గిరిప్రదక్షిణ సాగే 32 కి.మీ. పరిధిలో ప్రతీ కౌంటర్ వద్దా తగినంత మంది సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని, తగినన్ని మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని చెప్పారు. జోడుగుళ్ల పాలెం, అప్పుఘర్ వద్ద సముద్ర భాగంలో బోట్లను నిలిపి ఉంచాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఒక వేళ వర్షాలు, అలల ధాటి ఎక్కువైతే గనుక జోడుగుళ్లపాలెం, అప్పుఘర్ వద్ద భక్తులను స్నానాలకు అనుమంతించరాదని స్పష్టం చేశారు. స్నాన ఘట్టాల వద్ద దుస్తులు మార్చుకునేందుకు తగినన్ని గదులు సమకూర్చాలని సూచించారు. మెడికల్ క్యాంపు, అంబులెన్స్, తాగునీరు, టాయిలెట్లు, ఇతర హెల్ప్ లైన్ నంబర్లను దారిపొడువునా డిస్ ప్లే చేస్తూ హెూర్డింగులు పెట్టించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యుత్తు లైట్లను అమర్చాలని, వర్షం వల్ల అవి పోతే వెంటనే రిప్లేస్ చేసేలా సన్నద్ధం కావాలని చెప్పారు. సీసీటీవీ కెమెరాలు అమర్చాలని, వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేయాలన్నారు. వర్షం ఎక్కువైతే గనుక భక్తులు మెట్ల మార్గం ద్వారా కాకుండా బస్సుల్లో కొండపైకి చేరుకొనే అవకాశం ఉన్నందున ఆ మేరకు అదనంగా ఆర్టీసీ బస్సులను ఉంచుకోవాలని స్పష్టం చేశారు. అంబులెన్సును, అగ్నిమాపక వాహనాలను, సిబ్బందిని తగినంత మందిని అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈవో, జీవీఎంసీ, రెవెన్యూ, వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకుంటూ ముందుకు సాగాలని, కార్యక్రమం విజయవంతంలో భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. ఏడీసీలు విశ్వనాథన్, శ్రీనివాసరావు, ఆలయ ఈవో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ, రెవెన్యూ, వైద్యారోగ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో ఫుడ్ సేఫ్టీ అధికారి పర్యటన

విశాలాంధ్ర - ఆనందపురం: అతిసార వ్యాధి వ్యాపించిన ఆనందపురం మండలం జన్నాథపురం గ్రామంలో కేసులు గుర్తించడం వలన నివారణ లో భాగంగా గ్రామం మొత్తం వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి గ్రామం మొత్తం బ్లీచింగ్ చేయడం జరిగిందని ఫుడ్ సేఫ్టీ అధికారి ఎస్ .ఆనందరావు తెలిపారు. స్థానిక స్కూల్ నందు వైద్య పరీక్షలు ఏర్పాటు చేసి మెడికల్ సిబ్బంది డాక్టర్ అందుబాటులో ఉండి పర్యవేక్షణ చేయడం జరిగిందని, ఫుడ్స్ నమూనాలు తీసుకొని రెండు రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక ఇస్తామని సేఫ్టీ అధికారి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలనాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మూర్తి, కార్యదర్శి ప్రసాద్, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని పూర్తిస్థాయి చర్యలు చేపడతామని తెలి పారు.

గెలాక్సీ వాచ్ 7, గెలాక్సీ వాచ్ అల్ట్రా, బడ్స్ 3 సిరీస్‌ను విడుదల చేసిన శాంసంగ్

విశాలాంధ్ర- విశాఖపట్నం: భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్, తమ సరికొత్త గెలాక్సీ బడ్స్ 3, గెలాక్సీ బడ్స్ 3ప్రో, గెలాక్సీ వాచ్ 7 మరియు గెలాక్సీ వాచ్ అల్ట్రా స్మార్ట్‌వాచ్‌లను ముందస్తు (ప్రీ) -ఆర్డర్ చేసే వినియోగదారుల కోసం అద్భుతమైన ఆఫర్‌లను ప్రకటించింది. ప్రతి ఒక్కరికీ సమగ్రమైన వెల్‌నెస్ అను భవాలను అందించడానికి రూపొందించబడిన వేరబల్ పరికరాల ద్వారా మరింత మందికి గెలాక్సీ ఏఐ యొక్క శక్తిని గెలాక్సీ వాచ్ 7 మరియు గెలాక్సీ వాచ్ అల్ట్రా విస్తరింపజేస్తాయి.గెలాక్సీ వాచ్ పోర్ట్‌ఫోలియోకి సరికొత్త మరియు అత్యంత శక్తివంతమైన జోడింపు గెలాక్సీ వాచ్ అల్ట్రా. అత్యుత్తమ మేధస్సు సామర్థ్యాలతో తదుపరి దశ విజయాల కోసం మెరు గైన ఫిట్‌నెస్ అనుభవాల కోసం రూపొందించబడింది. రక్షణ విజువల్ సంపూర్ణతను మెరుగు పరచడానికి వాచ్ అల్ట్రా కొత్త కుషన్ డిజైన్‌ను పొందింది. ఇది టైటానియం గ్రేడ్ 4 ఫ్రేమ్ మరియు 10 ఏటీఎం వాటర్ రెసిస్టెన్స్‌తో వస్తుంది. సముద్రంలో ఈత కొట్టడం నుండి అసాధారణమైన వాతావరణంలో సైక్లింగ్ చేయడం వంటి అధు నాతన ఫిట్‌నెస్ అనుభవాల కోసం విస్తృత శ్రేణి ఆల్టిట్యూడ్‌లో కూడా పనిచేయగలదు.

మరిడిమాంబ అమ్మవారికి వెండి కిరీటం బహుకరణ

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగులలో కొలువుతీరిన శ్రీమరిడిమాంబ అమ్మవారికి గ్రామానికి చెందిన కొరుబిల్లి వెంకటరావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు అమ్మవారికి గురువారం మూడు లక్షల యాభై వేల విలువ చేసే మూడు కేజీల వెండి కిరీటాన్ని విరాళంగా అందించారు. అమ్మవారి పండుగ సందర్భంగా ఈ కిరీటాన్ని ఆలయ అర్చకులు జరుగుబిల్లి సుబ్బారావు చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ వారు దాతలను అభినందించారు.

ఫార్మాసిటీకి వ్యవసాయ బావుల నీరు

- ట్యాంకర్లతో సరఫరా
- నిలిచిన పంపింగ్ స్టేషన్
- మూలకు చేరిన రిజర్వాయర్

విశాలాంధ్ర - పరవాడ: ఎపిఐఐసి ఫార్మాసిటీని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. మంచినీటి సరఫరాను పట్టించుకోకుండా మూలకు నెట్టింది. మూడు రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో ట్యాంకర్లతో వ్యవసాయ బావుల నుంచి నీటిని కొనుక్కుంటున్నారు. వ్యవసాయ బావుల నుంచి మంచినీరు ఆగితే ఫార్మా యూనిట్ల ప్రాసిసెంగ్ నిలిచిపోయి కోట్ల రూపాయలు నష్టం వాటిల్లే పెను ప్రమాదం ఏర్ప డింది. పరవాడ ఫార్మాసిటీలో 92 యూనిట్లు ఉత్పత్తిని చేస్తున్నాయి. వీటికి కావల్సిన మంచినీటిని ఎపిఐఐసి తాడి పంపింగ్ స్టేషన్ నుంచి సరఫరా చేయాల్సి ఉంది. ఈ నీటిని రాంకీ పైపులైన్ల ద్వారా నేరుగా ఫార్మాకంపెనీలకు చేరుతుంది. ఏలేరు కాలువ నుంచి వస్తున్న నీటిని ఫార్మాసిటీ కోసం నిల్వ చేసేందుకు తాడి సమీపంలో రిజర్వాయర్‌ను నిర్మించారు. ఈ రిజర్వాయర్‌లో ఫార్మాకంపెనీలకు అవసరమయ్యే నీటిని నిల్వ చేస్తారు. అయితే రిజర్వాయర్ మూలకు చేరి ఏళ్లు గడు స్తున్నా ఎపిఐఐసి పట్టించుకోలేదు. ఏలేరు కాలువ నుంచి మంచి నీటిని తాడి వద్ద ఉన్న పంపింగ్ స్టేషన్ ద్వారా ముడి నీటిని ఫార్మా సిటీకి సరఫరా చేస్తారు. ఫార్మాసిటీ డెవలపర్ ఈ నీటిని శుద్ధి చేసి పైపులైన్ల ద్వారా ఫార్మాకంపెనీలకు సరఫరా చేస్తుంది. ఒక్కో కంపెనీ రోజుకు 150నుంచి 200కిలో లీటర్ల నీటిని తమ ప్రాసెసింగ్‌కు వినియోగిస్తుంది. అయితే తాడి సమీపంలోని ఎపిఐఐసి పంపింగ్ స్టేషన్ మోటార్లు మరమ్మతులకు గురి కావడంతో పంపింగ్ నిలిచి పోయింది. పర్యవసానంగా ఫార్మాకంపెనీలకు మంచినీటి సరఫరా నిలిచి పోయింది. ఫార్మాకంపెనీలు తమ ఉత్పత్తులను నిలిపి వేయకుండా పరవాడ, పరిసర మండలాల వ్యవసాయ బోర్ల నుంచి నీటిని సేకరించి ట్యాంకర్ల ద్వారా తెచ్చుకుంటున్నాయి. ఇది కాస్త తీవ్ర వ్యవప్రాయాసలతో కూడికున్నదని ఫార్మాకంపెనీల యాజమాన్యాలు చెబుతున్నారు. ఏళ్ల తరబడి ఫార్మాసిటీని ఎపిఐఐసి పట్టించుకోక పోవడంతో కనీసం నెలరోజులకు సరిపడే నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ మూలకు చేరింది. అలాగే పంపింగ్ స్టేషన్ యంత్రాల నిర్వాహణ చేపట్టక పోవడంతో నిలిచి పోయాయి. మూడు రోజులుగా ఇదే ఇబ్బందిని ఫార్మాకంపెనీలు ఎదుర్కొంటున్నాయి. ఈ విషయాన్ని ఎపిఐఐసి అధికారులు బహిర్గతం చేయక పోవడం గమనార్హం.

తుఫానుపై అప్రమత్తమైన అధికారులు

విశాలాంధ్ర - నక్కపల్లి: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఎక్కడ కూడా ఇబ్బందులు పడకుండా ప్రధానంగా మత్స్యకారులు సురక్షితంగా ఉండేటట్లు పంచాయతీరాజ్, రెవెన్యూ వర్గాలు అప్రమత్తమయ్యాయి. తుఫాను ప్రభావం పెద్దగా ఉండడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు మండలస్థాయి అధికారులు డిఎల్‌పిఓ ఎస్ఎస్ఎన్ మూర్తి సారధ్యంలో సమీక్షిస్తున్నారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. అనంతరం తుఫాన్ వలన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తీసుకోవలసిన జాగ్రత్తలపైన మూర్తి అన్ని గ్రామాల కార్యదర్శులు సచివాలయ సిబ్బందితో సమీక్ష జరిపి పలు సూచనలు చేశారు. ప్రధానంగా శానిటేషన్, త్రాగునీరు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. యుద్ధ ప్రాతిపదికన నక్కపల్లి మండలం నందు అన్ని గ్రామాల్లో తుఫాన్ ముందు, తుఫాన్ తరువాత తీసుకోవలసిన చర్యలు పైన దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.శ్రీకాంత్, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, సత్యనారాయణ, ఏవో దెందుకూరి సీతారామరాజు, ఉప తహశీల్దార్ సత్యనారాయణ, ఆర్ ఐ కన్నబాబు, రెవెన్యూ కార్యదర్శి, కార్యదర్శులు మజ్జి శ్రీనివాసరావు, పివిపి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యస్.రాయవరంలో భారీ వర్షం

విశాలాంధ్ర - యస్.రాయవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. మండలంలోని యస్.రాయవరం, కొరుప్రోలు, దార్లపూడి, వమ్మవరం, గెడ్డపాలెం తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో వర్షం నీరు నిలిచి పోయింది. మురుగు నీరు రోడ్లపై ప్రవహించింది.

21న గురు పౌర్ణమి వేడుకలు

విశాలాంధ్ర - చోడవరం: ఈ నెల 21న ఆదివారం బుచ్చియ్యపేట మండలం, విజయరామరాజుపేట గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం వద్ద గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు బాబా ఆలయ వ్యవస్థాపకులు దొడ్డి వెంకట ముత్యాల నాయుడు (పెదబాబు) శుక్రవారం తెలిపారు. షిర్డీ బాబాను నూతన వస్త్రాలంకరణ జరిపి విశేషంగా అలంకరించి, ఆదివారం వేకువ జాము నుండి పురుష సూక్త విధానంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, పాలాభిషేకం, పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన నిర్వహి స్తామన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు బాబా దర్శనంతోపాటు తీర్థ ప్రసాద ములు అందజేస్తామన్నారు. సాయంత్రం 4 నుండి కోలాటం, తీన్మార్, భారీ బాణాసంచాతో శ్రీ విఘ్నేశ్వర స్వామిని, శ్రీషిరిడి సాయిబాబా వారిని, శ్రీదత్తాత్రేయ స్వామిని తిరువీధి ఉత్సవంలో భాగంగా పురవీధుల్లో పల్లకీలో ఊరేగించి అనంతరం ఆలయంలో బాబా వారికి ఉయ్యాల సేవ, పవళింపు సేవ నిర్వహిస్తామని తెలిపారు.

వివిధ ఆలయాలకు విరాళాలు అందజేత

విశాలాంధ్ర - వి.మాడుగుల: బెంగుళూరులో స్థిరపడిన మాడుగులకు చెందిన క్లాస్ వన్ కాంట్రాక్టర్ చెక్కా శ్రీరామ్మూర్తి స్థానిక ఆలయాల అభివృద్ధికి విరాళాలు అందజేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయానికి రూ.1.26లక్షలు, మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి రూ.27వేలు, షిర్డిసాయిబాబా ఆలయానికి రూ.27వేలు మొత్తం రూ.1.80లక్షలు విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందించారు. ఈ మేరకు శుక్రవారం శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ అధ్యక్షులు కేవిపి.ఆంజనేయులు, ఆలయ కార్యదర్శి కొప్పాక వెంకట రాజేశ్వరరావు, కోశాధికారి కొప్పాక హరిబాబుకు, చెక్కా శ్రీరామ్మూర్తి కుమారుడు చెక్కా వెంకటేష్ విరాళం చెక్కును అందించారు. విరాళ దాత చెక్కా వెంకటేష్‌కు వాసవీ కన్యకా పరమేశ్వరి కమిటీ ఘనంగా శాలువ కప్పి అమ్మవారి మెమోంటో అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, బిజెపి నాయకులు పుట్టా గంగయ్య, భవిరిశెట్టి వెంకట్రావు, కొప్పాక దేవిప్రసాద్, జల్లు లింగన్న, జల్లు సంజయ్, మండల సతీష్, గౌరిపట్లపు నగేష్‌కుమార్‌తో పాటు విశాఖకు చెందిన మాటూరు అప్పలరాజు(రిటైర్డు సూపరిండెంట్), ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

3వ జోన్‌లో 25న బహిరంగ వేలం నిర్వహణ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖ నగర పాలక సంస్థ, ఆశీల్ మెట్ట జోన్-3 పరిధిలో గల వివిధ వాణిజ్య సముదాయాలలో ఖాళీగా ఉన్న షాపు రూములు 3 సంవత్సరములు కాలమునకు గుత్తకు ఇచ్చుటకు మరియు శివాజీ పార్కు గేటు, పార్కింగ్ రుసుము వసూలుకు గాను ఇచ్చిన తేదీ నుండి మార్చి 31, 2025 కాలమునకు గుత్త కు ఇచ్చేటకు తేదీ జూలై 25, 2024 ఉదయం 11 గంటలకు జోన్-3 కార్యాలయం ఆశీలు మెట్ట, విశాఖపట్నం వద్ద బహిరంగ వేలం నిర్వహించబడునని జోన్-3 జోనల్ కమిషనర్ విజయలక్ష్మి పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. కావున ఆసక్తి ఉన్న పాటదారులు వేలం పాటలో పాల్గొనవలసిందిగా కోరడమైనదని తెలిపారు. కావున వేలంపాటలో పాల్గొనేవారు జీవీఎంసీ నిబంధనలకు లోబడి వేలం పాటలో పాల్గొనవలసినదిగా కోరడమైనది. ఇతర వివరాలకు జీవీఎంసీ జోన్-3 ఆశీల్ మెట్ట జోనల్ కార్యాలయంలోని పర్యవేక్షకుని సంప్రదించగలరని జోనల్ కమిషనర్ తెలియజేశారు.

విశాఖలో కుండపోత వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం
కొండవాలు ప్రాంతాల్లో భయాందోళన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: గత మూడు రోజులుగా క్షణం తెరుపు లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. విశాఖ నగరంలో రహదారులన్నీ ఏరులై పారుతున్నాయి. వాయువ్య బంగాళా ఖాతంలో వాయుగుండం ప్రభావంతో కుండపోత వర్షాలతో జనజీవనం స్తంభించి పోయింది. శనివారం ఉదయం ఒడిశాలోని పూరీ దగ్గర తీరం దాటే అవకాశం ఉందని, ప్రస్తుతం పూరీకి తూర్పు ఆగ్నేయంగా 70కిలోమీటర్ల, కళింగ పట్నానికి తూర్పు ఈశాన్యంగా 240 కిలోమీటర్లు వద్ద కేంద్రీకృతం అయి ఉందని విశాఖలో వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తీరం దాటిన తర్వాత బలహీనపడి ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ మీదుగా కొనసాగే అవకాశం ఉందన్నారు. అల్పపీడనం ప్రభావంతో ఏపీ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డు, రామకృష్ణా థియేటర్ రోడ్డు, వెలమ పేట, పూర్ణ మార్కెట్, వన్ టౌన్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. జ్ఞానాపురం పాతవంతెన వద్ద వరదనీరు నిలిచిపోయింది. విశాఖ ఆర్ అండ్ బి కార్యాలయం నుంచి బిర్లా వరకు సర్వీసు రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తోంది. కార్యాలయాలు, పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మోకాళ్ల లోతు నీటిలో వాహనాలు నడుపుతూ అవస్థలు పడ్డారు. విశాఖలో అధికంగా కొండవాలు ప్రాంతాలపై నివసిస్తున్న ప్రజలు బిక్కుబిక్కుమంటూ భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడి పలు ఇల్లు నేలమట్ట మయ్యాయి. మధురవాడ, గాజువాక, పెందుర్తి, ఆరిలోవ , మల్కాపురం, వంటి ప్రాంతాల్లో వరద తీవ్రత ఉంది. ఏకధాటిగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు.